ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్నూలు
జిల్లా వార్తలు
సోమవారం 26 ఫిబ్రవరి 2024


జ్యోతిరావుపూలే, ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు


వేదికపై మాట్లాడుతున్న బీటీ నాయుడు

చంద్రబాబును సీఎం చేసే లక్ష్యంతో పని చేద్దాం

చంద్రబాబును సీఎం చేద్దాం

- టీడీపీతోనే బీసీలకు గుర్తింపు, సంక్షేమం
- ఎవరికి బీ ఫారం ఇచ్చినా గెలిపించుకుందాం
- జయహో బీసీ మహాసభలో నాయకుల పిలుపు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 25: కూడు, గూడు, గుడ్డ, నినాదంలో వచ్చిన టీడీపీని గెలిపించి రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు సీఎం చేయడానికి బీసీలంతా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా ఇన్‌చార్జి బీటీ నాయుడు అన్నారు. ఆదివారం నగరంలోని ఎంఆర్‌సీ ఫంక్షన్ హాలులో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణ ఆధ్వర్యంలో పీజీ నరసింహులు అధ్యక్షతన జయహో బీసీ మహాసభకు జిల్లాలో బీసీ నాయకులు, కార్యకర్తలు, పలు వర్గాల ప్రజలు హాజరయ్యారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు ఈలలు, కేకలతో సమావేశం మందిరం జయహో..బీసీ అంటూ నినాదాలతో హోరెత్తింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, బీసీ నాయకులు టీజీ భరత్, కేఈ శ్యామ్ బాబు, బొగ్గుల దస్తగిరి, మీనాక్షినాయుడు, జయనాగేశ్వరరెడ్డి, తుగ్గలి నాగేంద్ర, రాంపుల్లయ్య యాదవ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. బీటీ నాయుడు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో నిర్వహించే ఈ సభతో తాడేపల్లిలో వణుకు పుట్టాలని, బీసీల సత్తా చూపించాలని.. చంద్రన్న నాయకత్వంతో మరోసారి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుకు బీసీలు ఐక్యంగా పని చేయాలని కోరారు. బీసీలు రాష్ట్ర జనాభాలో సగం.. అంటే 2.50 కోట్ల మంది ఉన్నారని అన్నా రు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు వీరంతా పని చేయాలని పిలుపు నిచ్చారు. ఇంత జనాభా ఉన్న బీసీలకు జగన్ రెడ్డి పాలన ఎలా ఉందో తెలుసని అన్నారు. బీసీలను జగన్ రెడ్డి ఎంత సేపు ఓటర్లుగానే చూశారు తప్ప చేసిందేమీ లేదన్నారు. 56 కార్పొరేషన్లు పెట్టి కుర్చీ టేబుళ్లు ఇచ్చారుతప్ప నిధులు ఇవ్వలేదని అన్నారు. చంద్రబాబు బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా ఎందరికో అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. 25 మంది మంత్రుల్లో సగం పైగా బీసీలను మంత్రులను చేశారని అన్నారు. కర్నూలు జిల్లాలో వైసీపీ 14 నియోజకవర్గాల్లో గెలిచి జిల్లాకు ఏమి అభివృద్ధి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు బీసీలకు ఓ చట్టం తెస్తానని హమీ ఇచ్చారని అన్నారు. బీసీలను కులం పేరుతో దూషిస్తే 45 రోజులు జైలు శిక్ష విధించేలా చట్టం తేబోతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ జిల్లాలోని ప్రతి నాయకుడిపై కేసులు నమోదు చేశారు. చంద్రబాబుకు, జిల్లాలో నాయకులకు, కార్యకర్తలకు జరిగిన అవమానాలన్నీ గుర్తు పెట్టుకున్నామని ఆయన అన్నారు. సీఎంగా గెలిచిగాని మళ్లీ శాసన సభకు రాన ని చంద్రబాబు ఆరోజు శపథం చేశారని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం చంద్రబాబును గెలిపించాల్సిన బాధ్యత ప్రతి బీసీపై ఉందన్నారు. జిల్లాలోని 7 ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు గెలిపించునేందుకు ప్రతి ఒక్కరు శ్రమించాలని అన్నారు.



బీసీల కోసమే టీడీపీ ఆవిర్భవించింది

జనసేన, టీడీపీ ఉమ్మడిగా ప్రకటించిన జాబితాలోని 99పేర్లలో బీసీలు 18 మంది ఉన్నారు. తర్వాత ప్రకటించబోయే జాబితాల్లో 76 సీట్లు బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలు మనల్ని వేలెత్తి చూపించ కూడదు. పశ్చిమాన బీసీ వర్గాలదే ఆధిపత్యం ఉంటుంది. సమతుల్యం పాటించాల్సి న బాధ్యత ఉంది. జగన్‌రెడ్డి బీసీలను ఎలా మోసం చేశారో బీసీలు గుర్తు చేసుకోవాలన్నారు. గతంలో ఆదరణ పథకం ఎలా అమలైంది? బీసీలను ఏవిధంగా అదుకున్నాం? 2024లో బీసీ సత్తా చూపించాల్సినఅవసరం ఉంది. బీసీలు టీడీపీ బ్యాక్ బోన్ అని గుర్తు చేయాలి. బీసీల కోసం ఏర్పడిన పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి అందరం ప్రయత్నించాలి. భవిష్యత్ మనదే అని బీసీలు తెలుసుకోవాలి.

- కేఈ ప్రభాకర్, మాజీ మంత్రి



బీసీ మేనిఫెస్టో తెస్తారు

త్వరలో బీసీల మ్యానిఫెస్టో విడుదల కాబోతోంది. బీసీ చట్టం వస్తుంది. దిశా చట్టం లాగా కాదు. .పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేయించి చట్టాన్ని తీసుకురాబోతున్నారు. బీసీలపై దాడులు జరిగితే రక్షణగా ఉంటుంది. కార్పొరేషన్ల చైర్మన్ అంటే తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో క్యాబినెట్ ర్యాంక్‌లో ఉండేది.. వాస్తవాలు తెలుసుకుని ఈ 45 రోజుల్లో పొరపాటు జగరకుండా ..పార్టీని గెలిపించుకోవాలి.. లేదంటే ఆంధ్రప్రదేశ్ దేశపటంలో నుంచే తీసేయాల్సిన పరిస్థితి వస్తుంది. చంద్రబాబు ఒక విజనరి. లోకేష్ బాబు ఎంతో ముందు చూపుతో వెళ్తున్నారు. వారికి ఒక్కసారి అవకాశం కల్పించి టీడీపీని గెలిపించుకోవాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోడానికి బీసీలు కష్టపడి పని చేయాలి. నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే 2027లో అసెంబ్లీ స్థానాల విభజన జరుగుంది. అప్పుడు కర్నూలు రెండు నియోజకవర్గాలవుతాయి. ఒకటి బీసీలకు ఇవ్వాలి.

టీజీ భరత్
కర్నూలు టీడీపీ
అసెంబ్లీ అభ్యర్థి



చంద్రబాబు నాయుడు ఎన్నో సర్వేలు నిర్వహించి ఎమ్మెల్యే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. లోకేష్ బాబు శంఖారావం కార్యక్రమాన్ని చేపట్టబోతున్నారు. ఎవరికైనా సీటు దక్కాలంటే అదృష్టం ఉండాలి. బీసీ జయహో కార్యక్రమంలో బీసీ నాయకులతో సభలో మాట్లాడించాలి. బీసీలకు తగిన గుర్తింపు ఇచ్చేందుకు జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు పనిచేయాలి..

- మీనాక్షి నాయుడు,
ఆదోని, ఇన్‌చార్జి





బాబు గెలవకపోతే మరో బీహారే

చంద్రబాబు సీఎం అయితేనే యువతకు భవిష్యత్ ఉంటుంది. ఈసారి చంద్రబాబును గెలిపించుకోకపోతే రాష్ట్రం బీహార్, శ్రీలంక మాదిరి తయారవుతుంది. మళ్లీ వైసీపీ ప్రభుత్వం వచ్చిందంటే దేశంలో చిత్ర పటంలో రాష్ట్రానికి నేరాంధ్ర ప్రదేశ్ అనే పేరు పెట్టాల్సి వస్తుంది. ప్రతి బీసీ ఆలోచించి టీడీపీని గెలిపించుకోవాలి. దీని కోసం కలిసి కృషి చేయాలి.

- బొగ్గుల దస్తిగిరి,
కోడుమూరు ఇన్‌చార్జి

● బీసీలు తలుచుకుంటే టీడీపీ జెండా ఎగురుతుంది

అగ్రవర్ణాలతో ఎన్నో పోరాటాలు చేశాం. కాబట్టే మా కుటుంబానికి మొదటి జాబితాలో ప్రాధాన్యత దక్కింది. ఆదే తీరులో పార్టీ జెండా ఎగురవేయడానికి అన్ని వర్గాలతో కలిసి జిల్లాలో బీసీలందరూ కలిసి పని చేయాలి. వైసీపీ ప్రభుత్వంలో నాయకులు, కార్యకర్తలందరిపైన కేసులు పెట్టారు. ఐనా పార్టీని కాపాడుకుంటూ.. గెలిపించుకునేందుకు ప్రతి బీసీ పని చేయాలి. ఎవరికి సీటు వచ్చినా తెలుగుదేశం పార్టీ విజయానికి అందరం కలిసి కృషి చేయాలి. చంద్రబాబును సీఎంగా గెలిపించుకోవాలి..



- శ్యామ్ బాబు,
పత్తికొండ
టీడీపీ అభ్యర్థి



వడబోసి ఎంపిక చేస్తారు

చంద్రాబాబు ముఖ్యమంత్రి కావడానికి అందరూ పని చేయాలి. వడగట్టి సీట్లు ఇచ్చారు. 2024లో గెలిస్తేనే కర్నూలు జిల్లాకు మంత్రి పదవులు ఇస్తారు, డ్యామ్‌లు ఇస్తారు. చంద్రబాబు మనకు అబివృద్ధి చేసినా ప్రజలు ఎందుకు గుర్తించ లేకపోతున్నారు? రెండుసార్లు బీటీనాయుడు కు ఎంపీసీ సీటు ఇచ్చానా ఓడిపోయారు. అయినా శాసన సభ ఉపసభాపతి, ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడి పదవిలో కూర్చో పెట్టారు. ఇది తెలుగుదేశం పార్టీ బీసీలకు ఇచ్చే గౌరవం. మన జిల్లాలో ఎప్పుడూ ప్రయోగాలు చేయడంతోనే ఇలాంటి పరిస్థితి వస్తున్నది. ఆదే జగన్‌రెడ్డి బాలనాగిరెడ్డి కుటుంబానికి నాలుగు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారు. కానీ నా సీటు నాకే గ్యారెంటీ లేదు. రాజకీయాల్లో ఆత్మహత్యలే ఉంటాయి. గెలిచే వ్యక్తులకే టికెట్లు ఇస్తున్నారు. ఎవరికి సీట్లు కేటాయించినా బీ. ఫారం వచ్చే ప్రతి ఒక్కర్ని గెలిపించాల్సిన బాధ్యత బీసీలపై ఉంది.

-తిక్కారెడ్డి,
మంత్రాలయం ఇన్‌చార్జి



ఎందరో బీసీలకు పార్టీ గౌరవం ఇచ్చింది

బీసీల నుంచి ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, మంత్రులను చేసిన ఘనత తెలుగుదేశం పార్టీది. రాష్ట్రంలో జగన్ రెడ్డి బీసీ గొంతులు కోసి, ఆస్తులు నాశనం చేస్తున్నాడు. ప్రాంతాల మధ్య డ్రామాలు.. కులాల మధ్య తేడాలు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి గుండె కాయ లాంటి బీసీల్లో చిచ్చు పెడుతున్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ఈ రోజు బీసీల కోసం ప్రాణాలు లెక్క చేయకుండా ముందుకు వచ్చారు. ఆయనకు మద్దతు పలకాల్సిన బాధ్యత మనందరిపై ఉంద. బీవీ అంటే బీసీ.. బీసీ.. అంటే బీవీ అనే తీరులో బీవీ వంశం బీసీల కోసం పని చేసింది. రాష్ట్రంలో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలి.. దుర్మార్గమైన జగన్‌రెడ్డి పాలనను అంతమొందించాలి..

- జయనాగేశ్వరరెడ్డి,
ఎమ్మిగనూరు. ఇన్‌చార్జి

అమ్మవారి
రథోత్సవం



వైభవంగా చౌడేశ్వరీదేవి రథోత్సవం



కోడుమూరు, ఫిబ్రవరి 25: చౌడేశ్వరీ దేవి జాతరను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం అమ్మవారి రథోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ప్రతిష్ఠించారు. అనంతరం వేలాది మంది భక్తుల మధ్య అమ్మవారి రథోత్సవం చేపట్టారు. ఈ వేడుకను తిలకించేందుకు జిల్లాలోని చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున కదిలి వచ్చారు. దీంతో పట్టణ వీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఎస్ఐ బాలనరసింహులు ప్రత్యేక పూజలు చేపట్టి రథోత్సవాన్ని ప్రారంభించగా, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎద్దుల మహేశ్వరరెడ్డి, డీలర్ క్రిష్ణారెడ్డి, రవికుమార్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

50 పడకలతో క్రిటికల్ కేర్ బ్లాక్

- వర్చువల్‌గా ప్రారంభించిన పీఎం మోదీ
- హాజరైన కలెక్టర్, ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 25: ఆయుష్మాన్ భారత్, వికసిత్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ లో భాగంగా ఆదివారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.23.75 కోట్లతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్ డా.జి. సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి, డీఎంహెచ్‌వో డా.బి.రామగిడ్డయ్య వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ద్వారా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో 50 పడకలతో క్రిటికల్ కేర్ వార్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీనివల్ల తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న రోగులకు తక్షణమే వైద్యమందేలా క్రిటికల్ కేర్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఇందులో రోగి వచ్చినప్పటి నుంచి వారికి పరీక్షలు అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.


ప్రధాని మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తున్న కలెక్టర్, ఆసుపత్రి సూపరింటెండెంట్


శంకుస్థాపనలో పాల్గొన్న కలెక్టర్ సృజన

● 60 శాతం పూర్తి

రూ.23.75 కోట్లతో 50 పడకలతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ బ్లాక్‌ను న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ మూడవ, నాల్గవ అంతస్థులో నిర్మిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి తెలిపారు. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. 2020లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ క్రిటికల్ కేర్ యూనిట్లను మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో 8 చోట్ల క్రిటికల్ కేర్ వార్డుల నిర్మాణం జరుగుతోందని, ఇందులో భాగంగా కర్నూలు జీజీహెచ్‌లో కూడా క్రిటికల్ కేర్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. రూ.23.75 కోట్లలో రూ.7 కోట్లతో పరికరాలకు ఖర్చు పెట్టనున్నట్లు తెలిపారు. అత్యవసర రోగులకు మెరుగైన వైద్యసేవలు అందజేయడానికి క్రిటికల్ కేర్ బ్లాక్ ఎంతో దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, ఏపీఎంఎస్ఐడీసీ, ఎస్ఈ రమేష్ రెడ్డి, ఈఈ శివకుమార్ పాల్గొన్నారు.

- ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి

వైసీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు

విరుపాక్షి సమక్షంలో నాయకుల వాగ్వాదం


హొళగుంద, ఫిబ్రవరి 25: వైసీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. హొళగుంద మండలంలోని గజ్జెహళ్లి, వందవాగిలి గ్రామాలలో ఆదివారం ఆలూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గజ్జెహళ్లిలో హొళగుందకు చెందిన ఓ వైసీపీ నాయకుడు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వ్యక్తులు గజ్జెహళ్లిలో ముగ్గురు మాత్రమే ఉన్నారని, ఆ ముగ్గురు ఉంటే చాలని చెప్పడంతో మిగిలిన కార్యకర్తలు ఆయనపై భగ్గుమన్నారు. ఇప్పటి వరకు వారందరూ మంత్రి జయరాం పేరు చెప్పి గ్రామాన్ని నాశనం చేశారని, మళ్లీ వాళ్లనే ప్రోత్సహించడం ఎంత వరకు సమంజసం అన్నారు. దీంతో కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం విరుపాక్షి జోక్యం చేసుకొని అందరి కృషితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఏకతాటిగా నడవాల్సిన సమయం వచ్చిందని వారిని శాంతింపజేశారు. అలాగే వందవాగిలిలో జరిగిన కార్యక్రమానికి జయరాం వర్గీయులు హాజరు కాకపోవడంపై వర్గవిభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. ఇప్పటికే ఆలూరు నియోజకవర్గంలో అంతర్గత విభేదాలతో పార్టీ కుంటుపడిందని, ఇదిలాగే కొనసాగితే భవిష్యత్తు ఎన్నికల్లో పార్టీ మనుగడ కష్టమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.


గజ్జెహళ్లిలో విరుపాక్షి సమక్షంలో వాగ్వివాదం చేసుకుంటున్న వైసీపీ నాయకులు

నేడు ఆదోని రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు ప్రధాని పూజలు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 25: అమృత్ భారత్ పథకం కింద ఆదోని రైల్వే స్టేషన్‌లో వివిధ అభివృద్ధి పేనులను సోమవారం ప్రధాని మోదీ వర్చువల్లో భూమి పూజ నిర్వహించనున్నట్లు బీజేపీ ఆదోని అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజ్ గౌడ్ తెలిపారు. ఆదివారం బీజేపీ నాయకులు రైల్వేస్టేషన్‌ను సందర్శించి చేపట్టనున్న అభివృద్ధి పనుల గురించి అధికారులతో చర్చించారు. బీజేపీ జిల్లా కార్యదర్శులు రమాకాంత్, సూర్య, పట్టణ ప్రధాన కార్యదర్శి రమేష్ ఆచారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజ్ గౌడ్



ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 25: జిల్లాలో ఆదివారం గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గ్రూప్-2 పరీక్ష కోసం జిల్లాలో 126 కేంద్రాలను అధికారులు కేటాయించారు. పరీక్షకు 36,816 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 30,163 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు తెలిపారు.


పరీక్ష కేంద్రం వద్ద క్యూ కట్టిన అభ్యర్థులు.. నంబర్లు చూసుకుంటున్న దృశ్యం

జలాశయాలు.. ఎండిపోతున్నాయ్

- అత్తెసరు నీటిలో కూడా పక్క జిల్లాలకు..
- సీఎం మెప్పు కోసమే తరలింపు
- డెడ్ స్టోరేజీకి చేరిన నీరు
- జూలై వరకు తాగునీటి అవసరాలు తీర్చేదెలా...?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలాశయాలు ఎండిపోతున్నాయి. నీటి నిల్వలు వేగంగా అడుగంటుతున్నాయి. ఇప్పుడే ఇట్లా ఉంటే రాబోయే వేసవిలో తాగు నీటికి ఎట్లా? అనే ఆందోళన మొదలైంది. దీన్ని పట్టించుకోకుండా అధికారులు సీఎం మెప్పు కోసం చిత్తూరు జిల్లాకు వారం రోజులుగా నీరు సరఫరా చేస్తున్నారు. కొద్ది రోజుల్లో చిత్తూరు జిల్లాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన ఉంది. ఆ సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు సీఎంను నిలదీసే ప్రమాదం ఉంది. దాన్ని నివారించడానికి కర్నూలు జిల్లాకు చెందాల్సిన నీటిని తరలిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.


హంద్రీనీవా ప్రధాన పంపింగ్ కేంద్రం

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 25: ఈసారి వేసవిలో తాగు నీటికి కష్టమే. అప్పుడే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. జిల్లాలోని జలాశయాలు అత్తెసరు నీటితో డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. హంద్రీనీవా కాలువ నుంచి ముచ్చుమర్రి లిఫ్టు ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి కర్నూలు జిల్లాలోని 77 చెరువులకు నీటిని అందించే కార్యక్రమాన్ని జలవనరుల శాఖ అధికారులు చేపట్టారు. అయితే.. సీఎం మెప్పు కోసం చిత్తూరు జిల్లాకు చెందిన అధికారుల ఒత్తిడిపై హంద్రీనీవా కాలువ నుంచి ఆ సర్కిల్ ఉన్నతాధికారులు కర్నూలు జిల్లాలోని జలాశయాలకు, చెరువులకు నీరు అందించే కార్యక్రమాన్ని పక్కనపెట్టి గత కొద్ది రోజులుగా నిరంతరాయంగా చిత్తూరుకు నీరు అందిస్తున్నారు. గత సంవత్సరం సెప్టెంబరు 19న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కర్నూలు జిల్లాలో 77 చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చెరువుల కింద సాగు చేసిన పంటలను కాపాడుతామని, తాగునీటి ఎద్దడిని నివారిస్తామని ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, రైతాంగానికి సీఎం జగన్ హామీ ఇచ్చారు. ఆ మాటలు నీటిమూటలయ్యాయి. హంద్రీనీవా కాలువకు శ్రీశైలం జలాశయం నీటిని ముచ్చుమర్రి లిఫ్టు ద్వారా అందించేందుకు ఇక పది రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ పరిస్థితుల్లో ఈ కొద్దిపాటి నీటినైనా కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 77 చెరువులు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొంటున్న పశ్చిమ నియోజకవర్గాల్లోని చెరువులు, జలాశయాలకు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి విన్నవించారు. అయితే.. కొద్ది రోజుల్లో చిత్తూరు జిల్లాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటించే కార్యక్రమం ఉన్నందున ఆ ప్రాంత ప్రజలు నీటి కోసం ముఖ్యమంత్రిని నిలదీసే ప్రమాదం ఉంది. అందుకని అధికారులు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులకు నీటిని అందించే కార్యక్రమాన్ని పక్కన పెట్టి చిత్తూరు జిల్లాకు శ్రీశైలం జలాశయం నుంచి విడుదల చేస్తున్న 960 క్యూసెక్కుల నీటిని చిత్తూరు జిల్లాకే సరఫరా చేస్తున్నారు. దీనిపై కర్నూలు జిల్లాతో పాటు నంద్యాల జిల్లాల రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ ప్రయోజనాలను పణంగా పెట్టి మరో జిల్లాకు నీటిని విడుదల చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. శ్రీశైలం జలాశయంలో 215 టీఎంసీల పూర్తి సామర్థ్యం కాగా, ఆదివారం నాటికి 39.03 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. ముచ్చుమర్రి లిఫ్టు నుంచి శ్రీశైలం జలాశయం నీటిని 810 అడుగులకు చేరేంత వరకు మాత్రమే హంద్రీనీవా కాలువకు విడుదల చేసుకునే అవకాశం ఉంది. అయినా కూడా కర్నూలు జిల్లా ప్రయోజనాలను పక్కన పెట్టి చిత్తూరు జిల్లాకు నీటిని గత వారం రోజులుగా నిరంతరాయంగా విడుదల చేస్తుండటంపై ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు, ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎండలు ముదురుతుండటంతో వేగంగా కరిగిపోతున్న నీటి నిల్వలు

వేసవి కాలం ఇంకా మొదలు కాకముందే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎండలు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. రోజూ 38 డిగ్రీల ఉష్ణోగ్రత్త కర్నూలు జిల్లాలో నమోదవుతుంది. ఈ పరిస్థితుల కారణంగా అత్తెసరు జలాశయాల్లోని నీటి నిల్వలు వేగంగా ఆవిరైపోతున్నాయి. సుంకేసుల జలాశయంలో పూర్తి స్థాయి నీటి నిల్వ 1.2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.242 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. క్రిష్ణగిరి రిజర్వాయరులో పూర్తి స్థాయి నీటి నిల్వ 0.164 టీఎంసీలు కాగా, ఆ నీటిని వచ్చే వేసవి కాలంలో తాగునీటి కోసం ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే ఎండలు ముదరడంతో ఈ జలాశయంలో నీటి నిల్వలు త్వరితగతిన ఆవిరైపోయే పరిస్థితి ఉందని, హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని ఈ జలాశయానికి కొంతలో కొంతైనా విడుదల చేస్తే, రాబోయే వేసవి కాలంలో తాగునీటి ఎద్దడిని నివారించవచ్చని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. అదే విధంగా పందికోన జలాశయంలో పూర్తి స్థాయి నీటి నిల్వ 1.126 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.41 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. కొద్దిపాటి ఈ నిల్వ నీటితో వేసవి కాలంలో తాగునీటి ఎద్దడిని నివారించడం ఎలా అని జలవనరుల శాఖ అధికారులు తలపట్టుకున్నారు. 77 చెరువులకు నీటిని హంద్రీనీవా కాలువ ద్వారా నిరంతరాయంగా అందిస్తామని జలవనరుల శాఖ అధికారులు ప్రకటించడంతో రైతులు కంది, జొన్న, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేశారు. ఈ పంటలు చివరి దశలో ఉండటంతో మరో పదిహేను రోజులు నీరు అందించగలిగితే.. చేతికొచ్చే అవకాశం ఉంటుందని, లేకపోతే మట్టిపాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా విడుదలవుతున్న నీటి ద్వారా 44 చెరువులకు పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయగలిగామని, మరో 33 చెరువులకు అంతంత మాత్రమే నీరు అందిందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా హంద్రీనీవా ప్రాజెక్టు అధికారులు కర్నూలు జిల్లాలో క్రిష్ణగిరి, పందికోన రిజర్వాయరులతో పాటు 77 చెరువులకు నీటిని అందించాలని, లేకపోతే రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోవడంతో పాటు రాబోయే ఎండాకాలంలో తాగునీటి ఎద్దడిని నివారించడం కష్టమవుతుందని జలవనరుల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో జలాశయాల్లో నీటి నిల్వ వివరాలు

జలాశయం	పూర్తి స్థాయి నీటి నిల్వ (టీఎంసీలలో)	ప్రస్తుతం నీటి నిల్వ (టీఎంసీలలో)
శ్రీశైలం	215	38.8
తుంగభద్ర	105.78	9.15
సుంకేసుల	1.2	0.228
గాజులదిన్నె	4.5	1.544
క్రిష్ణగిరి	0.164	0.164
వెలుగోడు	16.95	1.936
గోరుకల్లు	12.5	3.2
అవుకు	4.148	1.132
పందికోన	1.126	0.46
పులికనుమ	1.243	0.27

నేడు 'స్పందన'

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 25: కర్నూలు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగే స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ డా.జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో బేకరిలో పొగలు


బేకరిలో కమ్ముకున్న పొగలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 25: బేతంచెర్ల పట్టణం పాత బస్టాండు సమీపంలో ఉన్న వెంకటేశ్వర సినిమా టాకీస్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని బెంగుళూరు బేకరిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో భారీగా పొగలు కమ్ముకొని సిబ్బంది బయటికి పరుగులు తీశారు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. బెంగుళూరు బేకరి షాప్‌కు ఉన్న విద్యుత్ ప్లగ్స్ షార్ట్ సర్క్యూట్ కావడంతో వైర్లన్నీ కాలిపోవడంతో ఈ ఘటన జరిగింది. విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై కరెంట్ సరఫరాను నిలిపివేశారు. దీంతో బేకరి సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

ఆటో బోల్తా పడి మహిళ మృతి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 25 : ఆటో బోల్తా పడి ఒక మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని సౌదరదిన్నె గ్రామ పొలాల రస్తాలో ఆదివారం జరిగింది. బనగానపల్లె మండల పరిధిలోని ఎర్రగుడి -హుసేనాపురం గ్రామానికి చెందిన 15 మంది కూలీలు కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నె గ్రామంలో మిరపంట కోయడానికి వెళ్తుండగా అదుపు తప్పి ఆటో బోల్తాపడి హసీనా (26)కు బలమైన గాయాలయ్యాయి. ఆమెను బనగాన పల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కోవెలకుంట్ల ఎస్సై వరప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెస్సు లక్ష్యం పూర్తి చేసేందుకు ప్రత్యేక టీమ్‌లు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 25: పంట ఉత్పత్తులను కొంటున్న వ్యాపారుల నుంచి మార్కెటింగ్ ఫీజును వసూలు చేసేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన లక్ష్యాన్ని మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు ఆదేశించారు. ఆదివారం విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న పంట ఉత్పత్తులకు సంబంధించి మార్కెటింగ్ ఫీజును తప్పనిసరిగా చెల్లించాల్సి ఉందని అన్నారు. అయితే కొంత మంది వ్యాపారులు సెస్సును ఎగ్గొట్టేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. మార్కెట్ కమిటీల ఆదాయాన్ని పక్కదారి పట్టకుండా ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగు ప్రత్యేక టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో రెండు, అదే విధంగా నంద్యాల జిల్లాలో రెండు టీములను ఏర్పాటు చేశామని, ఒక్కో టీములో ముగ్గురు అధికారులను నియమించామని అన్నారు. ఆదోని మార్కెట్ కమిటీకి సంబంధించి అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ ఆధ్వర్యంలో ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీల్లో తనిఖీలు చేపడుతారన్నారు. కోవెలకుంట్ల మార్కెట్ కమిటీ సెక్రటరీ జయప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలోని టీము, నంద్యాల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, డోన్ మార్కెట్ కమిటీల్లో తనిఖీలు చేస్తాయన్నారు. నంద్యాల జిల్లాలో డోన్ మార్కెట్ కమిటి సెక్రటరీ మాధవరెడ్డి నేతృత్వంలోని టీమ్, పాణ్యం, నందికొట్కూరు, బనగానపల్లె, ఆత్మకూరు మార్కెట్ కమిటీలలో సెస్సు వసూళ్ల వివరాలను చేపడుతాయన్నారు. పత్తికొండ మార్కెట్ కమిటీ సెక్రటరీ కార్నలీస్ టీమ్ ఆధ్వర్యంలోని బృందం కర్నూలు, కోడుమూరు, పత్తికొండ మార్కెట్ కమిటీల్లో సెస్సు వసూళ్లకు సంబంధించిన వివరాలను సేకరిస్తాయన్నారు.

డైరెక్టరుగా ఐఏఎస్‌ను నియమించండి

- ఉమ్మడి జిల్లా పశుసంవర్ధక శాఖ యూనియన్ చైర్మన్ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న యూనియన్ చైర్మన్ వెంకటేశ్వర్లు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 25: పశుసంవర్ధక శాఖకు ప్రభుత్వం ఐఏఎస్ అధికారిని నియమించాలని ఆ శాఖ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ సంఘం యూనియన్ల ఉమ్మడి జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పశుసంవర్ధక శాఖ గోకులం సమావేశ మందిరంలో నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ మూడు సంఘాల ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖలో అధికారులు తమ పోస్టులను, హోదాను పెంచుకోవడానికి ప్రయత్నించడం తప్ప రైతులకు క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న సిబ్బంది బాగోగులపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పశు సంపదను అస్తవ్యస్తంగా లెక్క చూపుతున్నారని, పశువులకు వ్యాక్సినేషన్ చేయమని, ట్యాగులు వేయమని ఆన్‌లైన్‌లో నమోదు చేయమని కింది స్థాయి ఉద్యోగులను వేధించడం అలవాటుగా మారిపోయిందని అన్నారు. ఇదంతా తెలిసి కూడా రాష్ట్ర స్థాయి అధికారులు ఆన్‌లైన్ పురోగతి నివేదికల పేరుతో ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీనికంతటికీ కారణం బీవీఎస్సీ చదివిన అధికారులే పశుసంవర్ధక శాఖకు రాష్ట్ర స్థాయి డైరెక్టరుగా ఉండటమని అన్నారు. గ్రామీణ పశు వైద్యశాలలను రీఆర్గనైజేషన్, అప్‌గ్రేడేషన్, క్లస్టర్ వ్యవస్థ అనే రకరకాల పేర్లతో సిబ్బందికి భవిష్యత్తు లేకుండా చేయడానికి కుట్రలు చేస్తున్నారని అన్నారు. వీటిని ప్రభుత్వం పరిశీలించి రైతుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఐఏఎస్ అధికారిని పశుసంవర్ధక శాఖకు డైరెక్టరుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు బజారి, ఇతర నాయకులు జనార్దన్ రెడ్డి, చంద్ర యాదవ్, సుబ్బరాయుడు, ఉమామహేశ్వరి దేవి, సులోచన, వరప్రసాద్ పాల్గొన్నారు.

రాజీనామాలకు సిద్ధం!

- కర్నూలు వైసీపీలో ధిక్కార స్వరం
- అసంతృప్తితో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ వర్గం
- రాజీనామాలకు సై అంటున్న కౌన్సిలర్లు?
- రగులుతున్న టికెట్ చిచ్చు


కార్యకర్తల సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ వర్గీయులు

కర్నూలు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నియోజకవర్గం వైసీపీలో ధిక్కార స్వరం పెరుగుతోంది. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌కు టికెట్ ఇవ్వకపోతే తాము మూకుమ్మడిగా రాజీనామాలకు సిద్ధం అంటూ పలువురు కార్పొరేటర్లు, ఆ పార్టీ సీనియర్ నాయకులు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. వైసీపీ సమన్వయకర్త (రాబోయే ఎన్నికల్లో అభ్యర్థి)గా డాక్టర్ ఇలియాస్‌బాషా పేరు ఖరారైందని.. రేపోమాపో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందనే సమచారం బయటకు రావడంతో హాఫీజ్‌ఖాన్ వర్గీయులు రగిలిపోతున్నారు. గురువారం అర్ధరాత్రి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య ఆఫీస్ ముట్టడించేందుకు వెళ్లారు. అయితే.. ఆ సమయంలో ఆయన లేకపోవడం.. ఇది మంచి పద్ధతి కాదంటూ ఎమ్మెల్యే కూడా ఆగ్రహం వ్యక్తం చేయడంతో వెనుదిరిగినట్లు సమాచారం. నష్ట నివారణ చర్యల్లో భాగంగా ఆదివారం ఆ పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రాంసుబ్బారెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హాఫీజ్‌ఖాన్‌కు టికెట్ నిరాకరిస్తే తాము కూడా వైసీపీని నిరాకరించాల్సి వస్తుందంటూ తేల్చి చెప్పగా.. అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని రాంసుబ్బారెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిసింది.

- వైసీపీ అధినేత, సీఎం జగన్ కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు హాఫీజ్‌ఖాన్‌కు జగన్ మొండి చేయి చూపించారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇది ఆయన వర్గీయులకు మింగుడు పడడం లేదు. అధిష్టానంపై ధిక్కార స్వరం వినిపించేందుకు సిద్ధమయ్యారు. గురువారం ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ విజయవాడ తాడేపల్లిలోని సీఎం క్యాంప్ ఆఫీసులో ముఖ్యమంత్రి జగన్, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిలను కలిశారు. రాబోయే ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం లేదని, ప్రమోషన్ ఇస్తున్నానని జగన్ తేల్చి చెప్పినట్లు సమాచారం. ఈ విషయం తెలియగానే హాఫీజ్‌ఖాన్ వర్గానికి చెందిన కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు ఆగ్రహంతో రగిలిపోయారు. తాడోపేడో తేల్చుకుందామని అదే రోజు అర్ధరాత్రి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య క్యాంప్ ఆఫీసుకు వెళ్లారు. అయితే ఆ సమయంలో ఆయన అక్కడ లేకపోవడంతో వెనుదిరిగినట్లు సమాచారం.

● కో-ఆర్డినేటర్ సమక్షంలో ప్లకార్డుల ప్రదర్శన:

దిద్దుబాటు చర్యలో భాగంగా హాఫీజ్‌ఖాన్ వర్గానికి చెందిన కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో వైసీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, కడప జిల్లా ఎమ్మెల్సీ రాంసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్యలు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దీంతో హాఫీజ్‌ఖాన్‌కు టికెట్ ఇవ్వాల్సిందే అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. తమ నాయకుడికి టికెట్ ఇవ్వకపోతే పార్టీలో ఉండబోమని అల్టీమేటమ్ జారీ చేశారు. వేదిక వద్దకు చేరుకొని రాంసుబ్బారెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్యలు సర్ది చెప్పేందకు ప్రయత్నించినా పట్టించుకోలేదు. ఓ దశలో రాంసుబ్బారెడ్డి గట్టిగా మాట్లాడాల్సి వచ్చింది. వారి అభిప్రాయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు సమాచారం. ఆ మాటలకు ఆగ్రహంతో ఊగిపోయిన ఎమ్మెల్యే వర్గీయులు.. మీ చేతుల్లో లేనప్పుడు ఈ మీటింగ్‌కు ఎందుకు వచ్చారంటూ రాజీనామాలు చేస్తామని ధిక్కార స్వరం వినిపించారు. ఇది గమనించిన ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ జోక్యం చేసుకొని అధిష్టానం నిర్ణయానికి అందరు కట్టుబడి ఉండాలని చెప్పారు.


వైసీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ రాంసుబ్బారెడ్డితో వాగ్వాదానికి దిగిన హాఫీజ్‌ఖాన్ వర్గీయులు

● టీడీపీ వైపు చూస్తున్న అహ్మద్ అలీఖాన్!:

'రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు టికెట్ ఇవ్వరు.. మీకే టికెట్.. మీరే వైసీపీ అభ్యర్థి అంటూ' ఐప్యాక్ టీం కీలక సభ్యులు డీసీసీ అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్‌ను నమ్మించారు. దీంతో అహ్మద్ అలీఖాన్ కాంగ్రెస్ సభ్యత్వానికి, డీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. అప్పటి వరకు ఊహల్లో పరుగులు పెట్టించిన ఐప్యాక్ సభ్యులు ఆ తరువాత ఆయన గురించి పట్టించుకోవడమే మానేశారు. ఉన్నట్టుండి డాక్టర్ ఇలియాస్‌బాషా పేరును తెరపైకి తేవడంతో అహ్మద్ అలీఖాన్ వర్గీయులు అసంతృప్తితో రగిలిపోతున్నారు.. టికెట్ ఇస్తామని మోసం చేసిన వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం.

● వేచి చూద్దాం..!:

కర్నూలు వైసీపీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి దంపతులు తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. తమ ఇద్దరిలో ఒకరికి అకాశం ఇవ్వాలని సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరుల దృష్టికి తీసుకెళ్లారు. అధిష్టానం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను కాదని కొత్త వ్యక్తిని తెరపైకి తెచ్చింది. ఈ నేపథ్యంలో వేచిచూద్దాం..! అనే ధోరణిలో ఎస్వీ దంపతులు, ఆయన వర్గీయులు ఉన్నట్లు సమాచారం.

యువతి కిడ్నాప్ కలకలం

- స్కార్పియో వాహనంతో బైక్‌ను ఢీకొట్టి..
- యువతిని ఎత్తుకెళ్లిన నిందితులు
- తండ్రి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- పత్తికొండ శివారులో దుండగుల అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న పోలీసులు

పత్తికొండ, ఫిబ్రవరి 25: తండ్రితో మోటారు సైకిల్‌పై పత్తికొండకు ఆసుపత్రికి వెళ్తుండగా.. స్కార్పియో వాహనంలో వచ్చిన నిందితులు వాహనాన్ని అటకాయించి యువతిని బలవంతంగా తీసుకెళ్లారు. అడ్డుకోబోయిన తండ్రిని రివాల్వరుతో బెదిరించి వాహనంలో వెళ్లిపోయారు. తండ్రి ఫిర్యాదు మేరకు యువతి కిడ్నాప్‌పై అన్ని స్టేషన్లకు సమాచారం ఇచ్చిన పోలీసులు నాలుగు గంటల్లోపే పత్తికొండ శివారులో నిందితులను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి చెందిన వరదరాజుల నాయుడు కూతురు శ్రీదేవికి ఆరోగ్యం బాగలేకపోతే పత్తికొండ ఆసుపత్రిలో చూపించేందుకు తన మోటారుసైకిల్‌పై బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ దూదేకొండ గ్రామం దాటి సుగాల నాగమ్మ దేవాలయం చేరుకునే సమయానికి వెనుక నుంచి వచ్చిన స్కార్పియో వాహనం వేగంగా వీరికి అడ్డుగా ఆగింది. మోటారు సైకిల్‌కు అడ్డగా స్కార్పియోతో ఆపిందెవరా అని గుర్తించేలోగా కప్పట్రాళ్లకు చెందిన సత్యనారాయణ నాయుడు, ఈదుల దేవరబండకు చెందిన అబ్దుల్ కలాం, కరివేములకు చెందిన విష్ణు, కప్పట్రాళ్లకు చెందిన బతుకన్నలు వాహనం నుంచి దిగి మోటారు సైకిల్‌పై ఉన్న శ్రీదేవిని బలవంతంగా స్కార్పియోలోకి ఎక్కించేందుకు ప్రయత్నించారు. దీంతో తండ్రి వరదరాజుల నాయుడు వీరిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా అబ్దుల్ కలాం రివాల్వర్ తీసి బెదిరించాడు. పక్కనే ఉన్న కృష్ణ, బతుకన్నలు ఆయనపై దాడి చేసి పక్కకు రోడ్డుపైకి తోసేశారు. తేరుకునేలోపే శ్రీదేవిని స్కార్పియో వాహనంలో బలవంతంగా ఎక్కించుకుని వెళ్లిపోయారు. దీంతో తేరుకున్న తండ్రి వరదరాజుల నాయుడు తన కూతురు కిడ్నాప్ విషయాన్ని పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలో దిగిన సీఐ మురళీ మోహన్ కిడ్నాప్‌కు సంబంధించిన వివరాలను, స్కార్పియో వాహన వివరాలను చుట్టుపక్క పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. పత్తికొండ పరిసర ప్రాంతాల్లో స్కార్పియో వాహనం ఆచూకీ కోసం పోలీసులు వాహనాల్లో తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో పత్తికొండ సమీపంలో హోసూరు రోడ్డులో బైపాస్ వద్ద స్కార్పియో వాహనాన్ని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో ఉన్న సత్యనారాయణ నాయుడు, బతుకన్నలతోపాటు కిడ్నాప్‌కు గురైన శ్రీదేవిని స్టేషన్‌కు తరలించారు. మరో ఇద్దరు కృష్ణ, అబ్దుల్ కలాం పరారీలో ఉన్నారు. సత్యనారాయణ నాయుడు, బతుకన్నలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని సీఐ తెలిపారు. వీరు ఉపయోగించిన రివాల్వర్, స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.


నిందితులు ఉపయోగించిన స్కార్పియో వాహనం

● ప్రేమ వ్యవహారమే కారణమా..?

కిడ్నాప్‌కు ప్రయత్నించిన సత్యనారాయణ నాయుడు వరదరాజుల నాయుడుకు సమీప బంధువు. వరుసకు అల్లుడు కావడంతో కూతురు శ్రీదేవిని వివాహం చేసుకుంటానని రెండు సంవత్సరాల క్రితం బంధువుల ద్వారా అడిగి చూశారు. అయితే సత్యనారాయణ నాయుడుకు కూతురును ఇచ్చేందుకు వరదరాజుల నాయుడు అంగీకరించకపోవడంతో పెళ్లి కుదరలేదు. కాగా సత్యనారాయణ నాయుడు శ్రీదేవిని వివాహం చేసుకునేందుకే కిడ్నాప్‌నకు యత్నించినట్లు సమాచారం.

యువకుడి ఆత్మహత్య

బేతంచెర్ల, ఫిబ్రవరి 25: పట్టణంలోని రేగుమానిపేటకు చెందిన ఎరుకలి సాయికృష్ణ (26) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది రేగుమానిపేటలో నివాసముంటున్న ఎరుకల సుంకన్న, సుబ్బమ్మల కుమారుడు సాయికృష్ణ భారత్ గ్యాస్‌లో పని చేస్తున్నాడు. సుంకన్న, సుబ్బమ్మ తాళ్ల వ్యాపారం నిమిత్తం శనివారం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయిక్రిష్ణ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చాక సాయిక్రిష్ణ తలుపులు తీయకపోవడంతో డోర్ పగులకొట్టి చూశారు. సాయిక్రిష్ణ ఫ్యాన్‌కు వేలాడుతూ శవమై కనిపించాడు.

ఉరివేసుకొని బాలుడు..

బేతంచెర్ల, ఫిబ్రవరి 25: పట్టణంలోని సుబ్బారెడ్డినగర్ కాలనీలో నివాసముంటున్న ఓ కుటుంబానికి చెందిన బాలుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. తల్లిదండ్రులు గమనించి హుటాహుటిన బేతంచెర్ల ఆసుపత్రికి తరలించేలోపే బాలుడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు.

టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), ఫిబ్రవరి 25: కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజానగర్‌కు చెందిన వైసీపీ కార్యకర్తలు ఆదివారం టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ కోడుమూరు అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో టీడీపీలో చేరారు. కాలనీకి చెందిన దాదాపు 50 కుటుంబాలు వైసీపీని వీడాయి. ఆ కాలనీకి చెందిన రమేష్, సతీష్ ఆధ్వర్యంలో కొంతమంది వార్డు సభ్యులు తీర్థం పుచ్చుకున్నట్లు వివరించారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లడుతూ కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీకి గెలుపునకు ప్రతి ఒక్కరూ సైనికుడిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విష్ణు, దస్తగిరిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో షేక్ హసీనా, విజయలక్ష్మి, షేక్షావలి, షాహిద్, ఉస్మాన్, షేక్ ఫాతిమా, ఫరీదాఖాతుమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముందస్తు నోటీసులు



కరె కృష్ణకు నోటీసు అందజేస్తున్న పోలీసులు

కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 25: సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 27న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ఆదివారం సంఘం నేతలకు పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు. ఈసందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కరెకృష్ణ, గట్టు తిమ్మప్పలు మాట్లాడుతూ నోటీసులతో ఉద్య మాలను ఆపలేరని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, డీఎస్సీ-2024లో అప్రెంటిస్ విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 3.3 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 2 డీఏలను, 11వ పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, వివిధ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల్లో పని చేసే టీచింగ్ స్టాఫ్‌కు ఎంటీఎస్‌ను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వివిధ సొసైటీలు, గురుకులాలు, కార్పొరేషన్లలో పని చేసే ఉద్యో గులకు పదవీ విరమణ వయస్సు 62ఏళ్లకు పెంచాలన్నారు.

నిర్బంధం దారుణం: ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్.గోకారి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 25: చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు పోలీసుల తో నోటీసులు అందజేసి నిర్బంధించడం దారుణమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అన్నారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవనంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన వారంలోపే సీపీ ఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అములు చేస్తామని చెప్పి ఇప్పటికి నాలుగున్నరేళ్లు పూర్తయినప్పటికీ సీపీఎస్‌ను రద్దు చేయలేదన్నారు. పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవుల బకాయిలు, ఏపీజీఎల్ఐ రుణాలకు సంబంధించి సుమారుగా రూ.21వేల కోట్ల బకాయిలు పడిందన్నారు .జీవో. నెం.117ను అమలు చేసి ప్రాథమిక విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఈ.సుధాకర్‌గౌడు, మహ్మద్ రఫి, ధనుంజయ, వెంకట్రాముడు పాల్గొన్నారు.

ఆకెపోగు ప్రభాకర్ ఆత్మహత్యాయత్నం

కర్నూలు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ శనివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మూడేళ్లుగా ఆ పార్టీ ఇన్‌చార్జిగా పని చేస్తున్న ఆయన టీడీపీ టికెట్ ఆశించారు. తనకు టికెట్ వస్తుందనే ధీమాగా ఉన్నారు. అయితే.. రాజకీయ సమీకరణలు దృష్ట్యా ఆ పార్టీ అధిష్టానం టీడీపీ అభ్యర్థిగా బొగ్గుల దస్తగిరి పేరు శనివారం ప్రకటించింది. టికెట్‌పైన ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆయన చివరికి టికెట్ రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యారు. శనివారం రాత్రి పురుగుల మందు తాగారు. దీంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌లో ఆయన సొంత బంధువులకు చెందిన ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన భార్య జయంతి మీడియాతో మాట్లాడారు. అధినేత చంద్రబాబు పునరాలోచించాలని కోరారు.

రేపు పురుషుల కబడ్డీ ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 25: స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 27న జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ నిర్వాహకులు ఏపీ రెడ్డి, కుబేర నాయుడు, జాకీర్ హుశేన్‌లు ఆదివారం తెలిపారు. 85 కేజీలలోపు బరువున్న క్రీడా కారులు అర్హులన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మార్చి 3న విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9989643383, 9966998818 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కోట్ల వర్గీయులను కలిసిన దస్తగిరి

కోడుమూరు, జనవరి 25: కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థిగా ఎన్నికైన బొగ్గుల దస్తగిరి ఆదివారం కోడుమూరు పట్టణంలోని కోట్ల వర్గీయులను మర్యాద పూర్వకంగా కలిశారు. సర్పంచు భాగ్యరత్న, మాజీ సర్పంచు కేఈ రాంబాబు, సీబీ లత, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డితోపాటు టీడీపీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు కే ఈ మల్లికార్జునగౌడ్‌ను కలిసి టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు.

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం: డీసీసీ

ఆలూరు/ ఆదోని టౌన్ ఫిబ్రవరి 25: అవినీతి, అరాచక పాలనను సాగిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబురావు అన్నారు. ఆదివారం ఆలూరు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో, ఆదోని పార్టీ కార్యాలయంలో జరిగిన వేర్వేరు సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వైసీపీ కేంద్రంతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకున్న కారణంగానే రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాలేదని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా, నిరుద్యోగం పోవాలన్నా, ప్రాజెక్టులు పూర్తి కావాలన్నా, ప్రత్యేక హోదా రావాలన్నా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 26వ తేదీన అనంతపురంలో జరిగే రాష్ట్ర పునః నిర్మాణ పోరాట సభకు కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ, ఆదోని నియోజకవర్గ బాధ్యుడు నీలకంఠప్ప, యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ దోకా, జిల్లా కార్యదర్శి క్రాంతినాయుడు పాల్గొన్నారు.

పశుగ్రాసానికి భలే డిమాండ్

» ట్రాక్టర్ గడ్డి రూ.10 వేలు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 25: పశుగ్రాసానికి భలే డిమాండ్ ఉంది. ఓర్వకల్లు మండలంలో సాగునీరు లేకపోవడంతో రైతులు వర్షాధారంపైనే ఆధారప డ్డారు. మండలంలో పశుగ్రాసం లేక రైతులు సుదూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని హుశేనాపురం, ఓర్వకల్లు, కాల్వ కన్నమడకల, కాల్వబుగ్గ తదితర గ్రామాల్లో 300 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. అయితే వర్షాలు పడకపోవడంతో వరి పంట రైతులకు తీవ్రంగా నష్టం జరిగింది. దీంతో రైతులు నంద్యాల జిల్లాలోని ఆలమూరు, కొనిదేడు, గడివేముల, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ వరి గడ్డి రూ.9వేల నుంచి రూ.10వేల దాకా కొనుగోలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం రైతులకు ఉచితంగా పశుగ్రాసం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



పశుగ్రాసాన్ని ట్రాక్టరులో తీసుకెళ్తున్న రైతులు

పశుగ్రాసానికి డిమాండ్ పెరిగింది



పశుగ్రాసానికి ఈ ఏడాది ధర విపరీతంగా పెరిగింది. దీంతో కొందరు రైతులు పశుగ్రాసాన్ని కొనలేకపోతున్నారు. మండలంలో పశుగ్రాసం కరువైంది.

- మాళీశ్వరరెడ్డి, రైతు

రైతులను ఆదుకోవాలి



నంద్యాల జిల్లా నుంచి పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నాం. ట్రాక్టర్ గడ్డి రూ.10వేలకు కొనుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పశువులను పస్తులు పెట్టలేక పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నాం.

- అబ్దుల్లా, రైతు

ప్రజా సంక్షేమానికి కృషి: టీజీ భరత్



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 25: కర్నూలు నగర ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని మౌర్యాఇన్‌లో 43వ వార్డు ఇల్లూరు నగర్‌కు చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అనంతరం యువ నాయకుడు ఇమ్రాన్ ఆధ్వర్యంలో గడ్డ ప్రాంతానికి చెందిన మహమ్మద్‌తోపాటు యువకులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో టీడీపీ చేరారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలపై ఎంతో భారం పడిందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయి పేదలు చితికిపోయారన్నారు. చంద్రబాబు నాయుడు సీఎం అయితే ప్రభుత్వానికి ఆదాయం పెంచడంతో పాటు ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందిస్తారని అన్నారు. కార్యక్రమలో టీడీపీ నాయకులు రాజశేఖరరెడ్డి, ఏసు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక



ఎంపికైన కబడ్డీ క్రీడాకారులతో అతిథులు

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 25: స్థానిక డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో పురుషుల కబడ్డీ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో కర్నూలు జిల్లా జట్టును ఎంపిక చేయడంలో దాదాపు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 18 మంది క్రీడాకారులను ఎంపిక చేశారని కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాకర్ తెలిపారు. ఎంపికైన కబడ్డీ క్రీడాకారులకు వారం రోజుల పాటు శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. ఎంపికైనవారందరూ శిక్షణలో పాల్గొని జిల్లా జట్టు తరపున ఆడి పతకాలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి సురేష్, సీనియర్ క్రీడాకారులు గోవిందు, అమర్, సుంకన్న, గోపాల్, నాగరాజు, సునీత, శివ, నాగరాజు పాల్గొన్నారు.

నాటక రంగానికి ఆదరణ పెరగాలి

విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 25: నాటక రంగానికి మరింత ఆదరణ పెరగాలని విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో దివంగత సుప్రసిద్ధ కళాకారుడు లొదిపల్లి అల్లాబక్ష్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గుమ్మళ్ల బలరామయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఇటీవల దివంగతులైన ప్రఖ్యాత పౌరాణిక పద్య నాటక నటుడు లొద్దిపల్లి అల్లాబక్ష్ చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బలరామయ్య మాట్లాడుతూ రాయలసీమ పద్య నాటకరంగ ఖ్యాతిని నాటి ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా చాటి చెప్పిన ఘనత లొద్దిపల్లి అల్లాబక్ష్‌కు దక్కుతుందని కొనియాడారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఒక్క సత్యహరిశ్చంద్ర నాటకాన్ని వెయ్యిసార్లుకు పైగా 80వ దశకంలోనే ప్రదర్శించిన ఘనత అల్లాబక్షుదేనని అన్నారు. అనంతరం కర్నూలుకు చెందిన సీనియర్ నటుడు హెచ్ చంద్రన్న బృందంచే సత్యహరిశ్చంద్ర కాటిసీను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం కళాకారులు మహ్మద్‌మియా, లక్ష్మీకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

● అలరించిన 'రాజుగారి గోచీ' సాంఘిక నాటకం

నేరస్థుల వల్ల బాధితులైన వారికి న్యాయం చేయడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయనే అంశం ఇతివృత్తంగా గుంటూరు జిల్లా వీరన్న పాలెం కళాకారులు ప్రదర్శించిన 'రాజుగారి గోచీ' సాంఘిక నాటకం ప్రేక్షకులను అలరింపజేసింది. ప్రముఖ దర్శకుడు చిట్టినేని సాయిబాబా దర్శకత్వంలో కళాకారులు వీరయ్య చౌదరి, పూర్ణ, సత్యం, హరికృష్ణ, పోతు రాజు, కే వీరయ్య తదితరులు ఈ నాటకంలో నటించారు.



నాటక దర్శకుడికి చెక్కు అందజేస్తున్న విశ్రాంత కలెక్టర్ బలరామయ్య

మేనిఫెస్టోలో కౌలు రైతులను చేర్చాలి

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం



పోస్టరు విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 25: వివిధ రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మెనిఫెస్టోలో కౌలు రైతులను చేర్చాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో పోస్టరును విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ భూములను సాగు చేసే కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, పెట్టుబడి సాయం కింద రైతు భరోసా రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు. కౌలు రైతుల సంక్షేమం రక్షణకై ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్మయ్య, సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, ఇందుర్తి మండల కార్యదర్శి మాధవకృష్ణ పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



జర్నలిస్టులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 25: జర్నలిస్టులకు క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి జర్నలిస్టు టోర్నమెంటుకు కర్నూలు జిల్లా నుంచి పాల్గొంటున్న జట్టుకు సభ్యులకు శంకర్‌శర్మ సహకారంతో దుస్తులను పంపిణీ చేశారు. ఆదివారం గాయత్రి ఎస్టేట్‌లోని క్లినిక్‌లో జర్నలిస్టులకు ఆయన దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒత్తిడి లేకుండా సమాజంలో ధైర్యంగా వార్త సేకరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జట్టు సభ్యులు మోహన్, శివరాజ్‌కుమార్, వెంకటేష్, ప్రకాష్, రవికుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి అల్లీహుసేన్ ఉరుసు

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 25: మండలంలోని వర్కూరు గ్రామంలో సద్గురు అల్లీహుసేన్ స్వామి ఉరుసు ఉత్సవాలు ఈనెల 27 నుంచి జరుగుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మంగళవారం గంధం, 28న ఉరుసు 29న కిస్తీలు జరుగుతాయని తెలిపారు. కాగా గంధం కార్యక్రమానికి అయ్యకొండ పీఠాధిపతి సయ్యద్ అక్బర్‌బాషా హుసేన్ స్వామి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు దర్గా పీఠాధిపతి అబ్దుల్ సలాం తెలిపారు. ఇందులో భాగంగా దర్గాలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, తత్వవిచారణ, భజనలు, భరతనాట్యం పోటీలు ఉంటాయని తెలిపారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజమే: ఎంపీ



పదవీ విరమణ చేసిన ప్యాపిలి చంద్రశేఖర్‌తో ఎంపీ సంజీవ్‌కుమార్

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 25: పదవీ విరమణ ప్రభుత్వ ఉద్యోగులకు సహజమేనని కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్ సంజీవ్‌కుమార్ అన్నారు. ఆదివా రం వెంకటరమణ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో ఆయన వ్యక్తిగత కార్యదర్శి ప్యాపిలి చంద్రశేఖర్ పదవీ విరమణ సందర్భంగా కర్నూలు పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) ఆధ్వర్యం లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో పద్మ శాలి స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ పాలకుర్తి రమేశ్, సంఘం నాయకులు కస్తూరి వేమయ్య, మేడం సుంకన్న, కస్తూరి హరిప్రసాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దళిత బతుకుల ముఖచిత్రమే 'సాక'

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 25: దళిత బతుకుల ముఖచిత్రంగా 'సాక' కథల పుస్తక సంకలనం సాహిత్య చరిత్రలో నిలిచిపోతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జంబూ సాహితీ సంపాదకులు డాక్టర్ సిద్దెంకి యాదగిరి, గుడిపల్లి నిరంజన్, తప్పెట ఓదయ్య సంపాదక వర్గంతో 2022లో దళిత కథా వార్షిక కథల సంకలనం 'సాక' పరిచయ సభ జరిగింది. కథా రచయిత ఇనాయతుల్లా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర పుస్తకాన్ని ఆవిష్కరించారు. విరసం రాష్ట్ర నాయకుడు పాణి మాట్లాడుతూ కథల్లో వివక్షరూపం వివిధ రూపాల్లో కనబడుతోందని, సామాజిక అంతరాలు స్పష్టంగా కథకులు చెప్పారని అన్నారు. కథల వస్తువు మాత్రం అణగారిన బతుకుల ముఖచిత్రమని చెప్పారు. ఆర్‌యూ తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ మాట్లాడుతూ కథల్లో దళితుల వాస్తవ జీవితాలు కనబడుతున్నాయని, కొన్ని కథలు చదువుతున్నప్పుడు కన్నీటి పర్యంతమైన సందర్భాలు ఉన్నాయని అన్నారు. సాక కథల సంపుటిలోని పదహారు కథల్లో వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. కవి వెంకటకృష్ణ మాట్లాడుతూ దళిత సాహిత్యంలోనే కాక యావత్ కథా సాహిత్యంలోనే సాక కథా సాహిత్యం భిన్నమైందని చెప్పారు. ఇందులోని కథా వస్తువు అనేక చర్చలకు దారితీస్తుందని అన్నారు. చివరిగా సాక సంపాదకులు తప్పెట ఓదయ్య, డాక్టర్ సిద్దెంకి యాదగిరి, గుడిపల్లి నిరంజన్ మాట్లాడుతూ జంబూ సాహితీ పేరుతో 2020 నుంచి దళిత కథా సంకలనాలు ప్రచురిస్తున్నామని అన్నారు. అవమానాలు, అసమానతలు ఒక ప్రాంతానికే పరిమితం కాదని, అనేక చోట్ల ఇది కొనసాగుతోందని చెప్పారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ ఈ సంకలనంలో తన కథకు చోటు కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా సంపాదకులను, అతిథులను కర్నూలు కవులు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీస్రవంతి జిల్లా నాయకుడు ఎంపీ బసవరాజు, అయ్యన్న, విజయులు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ చల్లా వాసురెడ్డి

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 25: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వీఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ చల్లా వాసురెడ్డి అన్నారు. ఆదివారం నగరంలో పెద్దమార్కెట్ సమీపంలోని మున్సిపల్ కార్పొరేషన్ పార్కులో ఏర్పాటు చేసిన తైక్వాండో క్రీడ బెల్ట్ గ్రేడింగ్ పోటీలను ఆయన ప్రాంభించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన బెల్టులను ప్రదానం చేశారు. ఈసందర్భంగా చల్లా వాసురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటూ క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసి యేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ టి.వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు సీటు హఫీజ్‌ఖాన్‌కే ఇవ్వాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 25: కర్నూలు సీటును ప్రస్తుత ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కే కేటాయించాలని నగరానికి చెందిన కొందరు కార్పొరేటర్లు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం హఫీజ్‌ఖాన్‌కు కర్నూలు ఎమ్మెల్యే సీటు లేదనే విషయం తెలియడంతో ఆయన అభిమా నులు, వర్గీయులు అదిష్టానంపై కోపోద్రేకంతో ఉన్నారు. ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై.రామయ్య, జిల్లా కో ఆర్డినేటర్ రామ సుబ్బారెడ్డిలతో కలిసి రాయల్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ మేరకు 33 వార్డులకు సంబంధించి అధిక శాతం హఫీజ్‌ఖాన్‌కే సీటును కేటాయిం చాలని రామసుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్లకార్డులతో నిరసన తెలిపారు.

వైసీపీ నాయకుడి ఆత్మహత్యాయత్నం

కర్నూలు, (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు టికెట్ ఇవ్వకపోతే ఆత్మహత్య శరణ్యమంటూ ఎమ్మెల్యే అభిమాని, వైసీపీ కార్యకర్త పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఆదివారం రాత్రి ఎమ్మెల్యే ఇంట్లోనే ఈ ఘటన చోటు చేసుకుంది. వైసీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రాంసుబ్బారెడ్డి ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా కార్పొరేటర్లు, నాయకులు సమావేశమయ్యారు. రాంసుబ్బారెడ్డి సమక్షంలో వైసీపీ కార్య కర్త పెట్రోల్ పోసి ఆత్మహత్యాయత్నం చేయగా అక్కడున్న వారు అడ్డుకున్నారు.



పెట్రోల్ పోసుకుంటున్న హఫీజ్‌ఖాన్ వర్గీయుడు

'కంటి జబ్బులపై నిర్లక్ష్యం తగదు'



వైద్య శిబిరంలో డాక్టర్ జయప్రకాశ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 25: కంటి జబ్బులపై నిర్లక్ష్యం తగదని కంటివైద్య నిపుణుడు డాక్టర్ జయప్రకాశ్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, బాలసాయి కంటి ఆసుపత్రి, మెడికేర్ క్లినిక్, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్. కర్నూలు గ్రేటర్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని గురురాఘవేంద్ర నగర్‌లో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రోగులకు కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా అడిషనల్ క్యాబినేట్ సెక్రటరీ డాక్టర్ రాయపాటి శ్రీని వాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలు అందించ డంలో లయన్స్ క్లబ్ తరపున సహకారం అందిస్తామని చెప్పారు. విశ్వభా రతి మెడికల్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్య బృందం తెలంగాణ రాష్ట్రంలోని ఇటిక్యాల గ్రామంలోనూ ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మెడికేర్ డాక్టర్ ఫరీదా, బి.రాజేశ్వరి, సోమన్న, శ్రీనివాసులు, ఆర్ఎంపీ రాఘవేంద్ర పాల్గొన్నారు.

'స్కూటర్ ర్యాలీని జయప్రదం చేయండి'



మాట్లాడుతున్న కే జగన్నాథం

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 25: స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని రైతులు చేపట్టిన ఆందోళనలో కేంద్ర ప్రభుత్వం ఐదు గురు రైతులను బలిగొన్నదానికి నిరసనగా సోమవారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన స్కూటర్ ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలులోని జిల్లా ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో దేశ రాజధానిలో రైతు లు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు చేపట్టిన ఆందోళనలో ఐదుగురు రైతులు మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప, నగర కార్యదర్శి జి. చంద్రశే ఖరప్ప, ప్రధాన కార్యదర్శి టి.రామాంజినేయులు, సీఐటీయూ జిల్లా అధ్య క్షుడు పీఎస్ రాధాకృష్ణ, నగర కార్యదర్శి విజయ్, ఏఐయూటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.నాగన్న, ఐఎఫ్‌టీయూ రైతుకూలీ సంఘం నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



పూర్వ విద్యార్థులు

మద్దికెర, ఫిబ్రవరి 25: మద్దికెర గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1988లో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక 36 ఏళ్ల తర్వాత కలిశారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆనాడు పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ ఒకేచోట కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 36 ఏళ్ల తర్వాత కలవడం పట్ల నాడు పాఠశాలలో పాతజ్ఞాపకలను ఆనందాల మధ్య పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తరగతి పూర్తి చేసుకున్న తామందరం ఒకే చోట కలుసుకోవడం పట్ల సంతోషంగా ఉందన్నారు. మేము చదువుకున్న పాఠశాలకు ఎంతో కొంత మేలు చేయాలనే సంకల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉన్నారు.

శివ స్వాముల ఊరేగింపు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 25: పట్టణంలో మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని శివ మాలధారణ స్వాములు ఆదివారం భక్తిశ్రద్ధలతో భారీ ఊరేగింపు చేశారు. ప్రభాకర్ టాకీస్ పక్కనే ఉన్న శంభు లింగేశ్వర స్వామి ఆలయం నుంచి ఎల్‌బీ స్ట్రీట్, షరాఫ్ బజార్, పీఎన్ రోడ్డు, పాత బస్టాండ్ మీదుగా వాహనంలో శివలింగాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. శివమాల ధారణ స్వాములు విభూది పూసుకొని నృత్యం చేశారు. శివనామ స్మరణతో పురవీధులు మార్మోగాయి.

జయహో బీసీ మహాసభకు తరలిన తమ్ముళ్లు

ఆదోని, ఫిబ్రవరి 25: కర్నూలు నగరంలోని ఎంఆర్సీ ఫంక్షన్ హాలులో జరిగే జయహో బీసీ మహాసభకు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్లు పెద్దఎత్తున తరలి వెళ్లారు. ఉదయం ఆరు గంటలకే మీనాక్షి నాయుడు స్వగృహంలో అల్పాహార విందును ఏర్పాటు చేసి దాదాపు 600 మందికి పైగా నాయకులను, కార్యకర్తలు ప్రత్యేక బస్సులలో కర్నూలుకు బయలుదేరి వెళ్లారు. మీనాక్షినాయుడు మాట్లాడుతూ వైసీపీ అధికారం చేపట్టాక రాష్ట్రంలో బీసీ సోదరులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని, స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్ తగ్గించిందని, 16 వేల మంది బీసీలకు అవకాశాలను దూరం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో నెట్టికల్లు ఈరన్న, రామకృష్ణ, తిమ్మప్ప, బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత రక్తనాళాల పరీక్షా శిబిరం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 25: ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాసవి కళ్యాణ మండపంలో ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ (హైదరాబాద్) సహకారంతో ఉచిత రక్తనాళాల పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 338 మందికి డాక్టర్ల బృందం ఖరీదైన పరీక్షలను ఉచితంగా నిర్వహించి, అవసరమైన సూచనలను అందించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రముఖ వ్యాపారవేత్త టీజీ పాండు రంగయ్య శెట్టి, టీజీ తారనాథ్, రాచోటి సుధాకర్ నిర్వాహకులను అభినందించారు. నగేష్, సంఘ అధ్యక్ష కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, మిరియాల శ్రీధర్, డైమండ్ రఘు, ఈరన్న శెట్టి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో అక్రమాలు అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్, ఫిబ్రవరి 25: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలని కోరుతూ ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో మార్కెట్ ముందు రైతుసంఘం నాయకులు, రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా నాయకులు పంపన్న గౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న మాట్లాడుతూ స్థానికంగా ఉన్న కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు కుమ్మక్కై తక్కువ ధరలుకు టెండర్లు వేస్తున్నారని ఆరోపించారు. అంతేగా కమిషన్ ఏజెంట్లు తమ దుకాణాలకు పంట ఉత్పత్తులను తెచ్చే రైతులనుంచి వాస్తవంగా రెండు శాతం కమిషన్ వసూలు చేయాల్సి ఉండగా నాలుగు శాతం వసూలు చేస్తు రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. మార్కెట్ లో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి పద్మావతికి వినతిపత్రం ఇచ్చారు.

'నాడు-నేడు' పునాదుల్లోనే!






పెరవలి, ఎం అగ్రహారం గ్రామాల్లో పునాదుల్లోనే నిలిచిపోయిన పాఠశాల భవనాలు

మద్దికెర, ఫిబ్రవరి 25: 'మేం వచ్చాం.. ప్రభుత్వ పాఠశాలల దిశనే మార్చేశాం.. నాడు-నేడు పనులతో ఎంతో పురోభివృద్ధి సాధించాం' అంటూ వైసీపీ నాయకులు నిత్యం ప్రచారం చేసుకుంటున్న విషయం తెలిసిందే. కానీ, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మండలంలో ప్రభుత్వ పాఠశాల భవనాలకు నిధుల కొరత వెంటాడుతోంది. నాడు-నేడు కింద చేపట్టిన నిర్మాణాలు సకాలంలో నిధులు రాకపోవడంతో పునాదుల్లోనే నిలిచిపోయాయి. మొండి గోడలను చూస్తూ ఇవి ఎప్పటికి పూర్తవుతాయోనంటూ ప్రజలు ఆశగా ఎదరు చూస్తూ ఉన్నారు.

మండలంలోని పెరవలి గ్రామంలోని సిలారమ్మ కోటలో డీపీఏపీ పాఠశాల గదులను గత ఏడాది కొత్త భవనం నిర్మిస్తామంటూ కూల్చివేశారు. నిధులు రాలేదంటూ ఇప్పటిదాకా పూర్తి చేయలేదు. అలాగే మండలంలోని ఎం.అగ్రహారం జిల్లా పరిషత్ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో పునాదులకే పరిమితం చేసి నిలిపివేశారు. పాఠశాల భవనం కూల్చి వేయడంతో విద్యార్థులు వేరే పాఠశాలలో చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలల నిర్మాణానికి నిధుల కొరత ఉన్నందున తాము పనులు చేయ లేమంటూ ఉపాధ్యాయులు చెబుతున్నారు. పెరవలి గ్రామ పాఠశాలకు రూ.6లక్షలు రావాల్సి ఉంది. ఎం.అగ్రహారం పాఠశాలకు రూ.12 లక్షలు రావాల్సి ఉండటంతో పనులు చేయలేక పునాదులకే పరిమితం చేశారు. విద్యాసంవత్సరం ముగుస్తున్నప్పటికీ ఇంతవరకు ఎలాంటి పనులు పూర్తి కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంతో మండల విద్యాధికారి రంగస్వామి మాట్లాడుతూ నిధుల కొరత వల్ల జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పనులు నిలిపివేశామని, నిధులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్ష



ఆదోని ఆర్ట్స్ కాలేజీ పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 25: ఏపీపీఎస్సీ ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్ష ఆదోని పట్టణంలోని పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రాల వద్ద సందడి నెలకొంది. గంట ముందుగానే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిచ్చారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. ఆదోని డివిజన్‌లో మొత్తం 40 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా పట్టణంలో 21, ఎమ్మిగనూరులో 16, మంత్రాలయంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆర్ట్స్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ తనిఖీ చేశారు. సీసీ ఫుటేజీ ద్వారా పరీక్ష కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి ఉన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబురావు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబురావు

ఆలూరు/ ఆదోని టౌన్ ఫిబ్రవరి 25: అవినీతి, అరాచక పాలనను సాగిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబురావు అన్నారు. ఆదివారం ఆలూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో, ఆదోని పార్టీ కార్యాలయంలో జరిగిన వేర్వేరు సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వైసీపీ కేంద్రంతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకున్న కారణంగానే రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాలేదని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా, నిరుద్యోగం పోవాలన్నా, ప్రాజెక్టులు పూర్తి కావాలన్నా, ప్రత్యేక హోదా రావాలన్నా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 26వ తేదీన అనంతపురంలో జరిగే రాష్ట్ర పునః నిర్మాణ పోరాట సభకు కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ, ఆదోని నియోజకవర్గ బాధ్యుడు నీలకంఠప్ప, యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ దోకా, జిల్లా కార్యదర్శి క్రాంతినాయుడు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి శూన్యం : బీవీ



మాచాపురంలో మాట్లాడుతున్న బీవీ

నందవరం, ఫిబ్రవరి 25: వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. అదివారం మండల పరిధిలోని మాచాపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బీవీ ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చేస్తానని లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజలపై మోయలేని భారం మోపారని ఆరోపించారు. గత టీడీపీ హయాంలో ఇంటింటికి కోళాయి వేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చేశామని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగరాజుగౌడు, మండల పార్టీ కన్వీనర్ డివి రాముడు, మాచాపురం కాశీంవలీ, గురురాజారావు, మస్తాన్, రహిమాన్, మాచాపురం పీరసాబ్, వలీ, సురేంద్రరెడ్డి, డబ్బా ఈరన్న, వడ్డె గోపాల్, నదిక్కైరవాడి వీరేష్, ఆదిశేషు, మిట్టాసోమాపురం వీరేష్ పాల్గొన్నారు.

కౌతాళంకు చేరిన ఎల్లెల్సీ నీరు

కౌతాళం, ఫిబ్రవరి 25: తాగునీటి అవసరాల కోసం కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నుంచి ఎల్‌ఎల్‌సీకి తాగునీటిని అధికారులు ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం తెల్లవారు జామున ఆ నీరు కౌతాళం వద్ద ఉన్న ఎల్‌ఎల్‌సీ కాలువకు చేరింది. ఈ నీరు కేవలం తాగునీటి అవసరాల కోసం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, చెరువులు నింపుకోడానికి మాత్రమే వినియోగించుకోవాలని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈ కాలువలో ప్రస్తుతం 500క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందని తెలిపారు. ఎవరైన సాగుకు వాడినా కేసులు నమోదు చేయిస్తామని అధికారులు తెలిపారు.



ఎల్‌ఎల్‌సీలో ప్రవహిస్తున్న నీరు

చీకటి వెలుగులు పుస్తకావిష్కరణ



రామలింగమ్మకు పుస్తకం అంకితం చేస్తున్న సవ్వప్ప గారి ఈరన్న

ఆలూరు, ఫిబ్రవరి 25: బహుగ్రంథ కర్త, కమల కళానికేతన్ సాహితీ సంస్థ అధ్యక్షుడు సవ్వప్ప గారి ఈరన్న రచించిన చీకటి వెలుగులు 69వ పుస్తకాన్ని ఆదివారం ఆలూరు గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత తహసీల్దార్ షేక్షావలి, విశ్రాంత ఎంఈవో హెచ్ రామలింగమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం పుస్తకాన్ని విశ్రాంత మండల విద్యాధికారి హత్తిబెళగల్ రామలింగమ్మకు అంకితం చేశారు. ఈ సందర్భంగా పుస్తక ఆవిష్కరణను కవులు, సాహిత్యవేత్తలు, సోమన్న, ఎస్ భాస్కర్ సమీక్షించారు. తెలుగు భాష పరిరక్షణ ఆవశ్యకతను గూర్చి వివరించారు. అనంతరం పుస్తక రచయిత కవి సవ్వప్ప గారి ఈరన్నను సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నీరుగంటి వెంకటేశ్వర్లు, పద్యకవి ఈశ్వరప్ప, కళాకారుడు రంగన్న, నల్లారెడ్డి, యం. జి. భాస్కర్ గౌడ్, కుమారి సుచేత, వీరాస్వామి, రామ్మూర్తి విద్యార్థులు పాల్గొన్నారు.

రాతిదూలం పోటీలు పల్లె సంస్కృతికి నిదర్శనం



నగదు బహుమతిని అందిస్తున్న మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ యాదవ్

మద్దికెర, ఫిబ్రవరి 25: గ్రామీణ ప్రాంతాల్లో జాతరలకు, పండుగలకు నిర్వహించే రాతిదూలం పోటీలు పల్లె సంస్కృతికి నిదర్శనమని పత్తికొండ సీఐ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ డీఎస్ అనితా యాదవ్, సర్పంచు బండారు సుహాసిని అన్నారు. ఆదివారం మద్దికెర గ్రామంలో మద్దమాంబ జాతరను పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి న్యూకేటగిరి రాతిదూలం పోటీలను స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ప్రారంభించారు. ఈ పోటీల్లో పది జతల ఎద్దులు పాల్గొనగా.. నంద్యాల జిల్లా కొత్తూరుకు చెందిన స్వారెడ్డి వృషభాలు మొదటి స్థానంలో రాగా రూ.60వేలు మాజీ ఎంపీటీసీ డి.శ్రీనివాస్ యాదవ్ బ్రదర్స్ అందజేశారు. రెండో బహుమతి కొత్తూరు గ్రామానికి చెందిన వృషభాలు విజయం సాధించగా రూ.40వేలు కోడుమూరు కేశవులు, గొడుగు వేణు అందజేశారు. మూడో బహుమతి అనంతపురం పట్టణానికి చెందిన పెద్దవడుగూరు రామాంజినేయులు వృషభాలు విజయం సాధించగా.. రూ.30వేలు, మైత్రి స్కూల్ ఆనందరావు, నాలుగో బహుమతి కృష్ణ యూత్‌వారు రూ.20వేలు, 5వ బహమతి కవిరెడ్డి రామాంజనేయులు బ్రదర్స్, 6వ బహుమతి రూ.5వేలు మిగతా వృషభాల యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, మాజీ ఉప సర్పంచు వెంకట్రామిరెడ్డి, పంచాయితీ సలహాదారులు బండారు ఆంజనేయులు, నిర్వాహకులు ఆకుల ఖాజావలి, డి.శ్రీనివాస్ యాదవ్, కవిరెడ్డి గోపాల్, కవిరెడ్డి కృష్ణ, కవిరెడ్డి రామాంజులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, చాకలి నగేష్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

సత్తా చాటిన కొండబాలవారి పాలెం వృషభాలు



బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 25: చిట్యాల తాతా లాలు స్వామి ఉరుసు సందర్భంగా నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలలో గుంటూరు జిల్లా కొండబాలవారి పాలెంకు చెందిన జీపీ చౌదరి వృషబాలు సత్తాచాటాయి. ఆదివారం జరిగిన పోటీలలో జీపీ చౌదరి వృషబాలు, కర్నూలు జిల్లా పి.రుద్రవరం గ్రామానికి చెందిన ఎల్లగౌడ్ వృషబాలు, గుంటూరు జిల్లా మతుకుమల్లి గ్రామానికి చెందిన మాంద్రు మల్లయ్య, కర్నూలు జిల్లా పంచలింగాల గ్రామానికి చెందిన బైరిపోగు, గుంటూర్ జిల్లా కొండపాటూరు గ్రామానికి చెందిన కాకా వృషబాలు వరుసగా బహుమతులు కైవసం చేసుకున్నాయి.

ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

ఆలూరు, ఫిబ్రవరి 25: ఎస్సీ వర్గీకరణ సాధనకై ఉద్యమం ఉధృతం చేస్తామని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగుల భాస్కర్ అన్నారు. ఆదివారం స్థానిక అర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఈనెల 28న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల అనుబంధ సంఘాల సమీక్ష కరపత్రాలను జిల్లా సినియర్ నాయకులు ముత్యాల గాదెలింగ అధ్యక్షతన విడుదల చేశారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఎంఆర్‌పీఎస్ నాయకులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉచ్చురంగా, భాస్కర్, సుధాకర్, శేకర్, బాబు, వినోద్, రాజన్న పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పత్తికొండలో విజయఢంకా మోగిస్తాం

● పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు



మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

పత్తికొండ, ఫిబ్రవరి 25: రానున్న ఎన్నికల్లో పత్తికొండ నియోజకవర్గంలో విజయఢంకా మోగిస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన కూటమిగా 99 సీట్లు మొదటి విడతగా ప్రకటించారని, అందులో అందరూ విద్యావంతులేనని పేర్కొన్నారు. వైసీపీ ఇప్పటి వరకు ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థులందరూ స్మగ్లర్లు, గంజాయి, ఎర్రచందనం, అక్రమ రవాణా చేసే వ్యక్తులే ఉన్నారని ఆరోపించారు. నారా లోకేశ్, పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అధినేత తనపై, తన కుటుంబంపై నమ్మకం ఉంచి మొదటి విడతలోనే తనకు సీటు కేటాయించారనీ, ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని పత్తికొండలో టీడీపీ విజయాన్ని సాధించి అధినేతకు కానుకగా అందిస్తామని అన్నారు.

రేపు వాహనాల వేలం

ఆలూరు, ఫిబ్రవరి 25: ఆలూరు ఎక్సైజ్ స్టేషన్ (సెబ్) పరిధిలో పట్టుబడిన వాహనాల వేలం పాటలు ఈ నెల 27న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలూరు సెబ్ సీఐ సోమశేకర్ ఆదివారం తెలిపారు. జిల్లా సెబ్ ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఈ వేలాలు జరుగుతాయన్నారు. వేలం పాటల్లో పాల్గొనే వారు, అదే రోజు ఉదయం 10 గంటల లోపు రూ.3 వేలు చెల్లించాలని సూచించారు. మొత్తం 17 వాహనాలకు వేలాలు జరుగతాయన్నారు. ముందస్తుగా ధర చెల్లించిన వారు మాత్రమే వేలల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

తుగ్గలి, ఫిబ్రవరి 25: టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని టీడీపీ నాయకులు చంద్రశేఖర్ యాదవ్, బీసీ వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని జి.ఎర్రగుడిలో వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసమే టీడీపీని ఎన్టీఆర్ స్థాపించారని, నాటి నుంచే బీసీలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుంటున్నారని గుర్తుచేశారు. మహిళాభివృద్ధి కూడా టీడీపీ హయాంలోనే జరిగిందని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి రుణ సౌకర్యాలు కల్పించకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. పేరుకు మాత్రమే కుల కార్పొరేషన్లు ఏర్పాటు చేశారే తప్ప వాటి వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు లక్ష్మణస్వామి, రవి యాదవ్ తదితరులు ఉన్నారు

కాపులంతా జనసేన వైపే

మద్దికెర, ఫిబ్రవరి 25: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయానికే తామంతా కట్టుబడి ఉన్నామని, కాపులంతా జనసేన వైపే ఉంటామని సౌత్ ఇండియా కాపు కార్పొరేషన్ జిల్లా అధ్యక్షుడు వైటి వీరన్న, అనంతపురం జిల్లా కాపు కార్పొరేషన్ యూత్ అధ్యక్షుడు బుర్రా అఖిల్ అన్నారు. ఆదివారం మద్దికెరలో విలేకరులతో మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుని ఒక వ్యూహం ప్రకారం ముందుకు సాగుతున్నారని, కాపులంతా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. హరిరామజోగయ్య తన సొంత నిర్ణయాన్ని ప్రకటించుకున్నారని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ నిర్ణయమే తమ నిర్ణయంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. జనసేన, టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు.

కేఈ శ్యాంబాబు విజయం కోసం పని చేస్తాం

మద్దికెర, ఫిబ్రవరి 25: పత్తికొండ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు విజయం కోసం పని చేస్తామని మాజీ ఎంపీటీసీ పులిశేఖర్, మండల తెలుగు యువత అధ్యక్షులు మూలింటి రాము యాదవ్, మూలింటి రంగస్వామి అన్నారు. ఆదివారం పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబును సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేదుకు పని చేస్తామని పేర్కొన్నారు.

హుండీ లెక్కింపు

దేవనకొండ, ఫిబ్రవరి 25: కౌలుట్ల చెన్నకేశవస్వామి హుండీ లెక్కింపు ఆదివారం ఆలయం ఆవరణంలో లెక్కించారు. హుండీ రూ.3,54,830, కళ్యాణం రూ.9,540, బ్రహ్మోత్సవాల ద్వారా రూ.1,57,680, సేవ టికెట్‌ల ద్వారా రూ.50,725, దుకాణాలు రూ.21 ,870 ద్వారా మొత్తం ఆదాయం రూ.5,94,645 వచ్చినట్లు ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా స్వామి, అమ్మవార్లకి ఉదయం చక్రస్నానం, సాయంత్రం పి.కొటకొండ గ్రామంలో పల్లకి సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయ చైర్మన్ హనుమంతరెడ్డి, సిబ్బంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో సంక్షేమ పాలన



ఆదోనిలోని కార్వాన్‌పేటలో ఉమ్మీ సలీం ప్రచారం

ఆదోని, ఫిబ్రవరి 25: టీడీపీ అధినేత ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమ పాలన సాధ్యమని టీడీపీ ముస్లిం మైనార్టీ సీనియర్ నాయకులు ఉమ్మీ సలీం అన్నారు. ఆదివారం పట్టణంలోని కౌడల్‌పేట, కార్వాన్ పేటలో బాబూ ష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మీ సలీం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అంద జేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో రాజు, సమీర్, షేరు, ఈరన్న, ఫాయాజ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మైనార్టీలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలి

ఆదోని(అగ్రికల్చర్), ఫిబ్రవరి 25: ముస్లిం మైనార్టీలకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహించేందుకు టీడీపీ మరిన్ని సీట్లు కేటాయించాలని ముస్లిం మైనారిటీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్. షేక్ మహబూబ్ బాషా అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2024 ఎన్నికలకు సంబంధించి తేదేపా, జనసేన పొత్తులో ప్రకటించిన సీట్లలో ముస్లిం మైనారిటీలకు తీరని అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. తేదేపా ప్రకటించిన 94 సీట్లలో మైనారిటీలకు ఒక్క సీటు మాత్రమే కేటాయించడం అన్యాయం అన్నారు. అందులో నంద్యాల అసెంబ్లీ అభ్యర్థిగా ఎంఎండీ ఫరూక్ మాత్రమే ఉన్నారన్నారు. జనసేన పార్టీ కూడా ఆ సామాజిక వర్గానికి చెందిన వారికే అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఈనెల 29న ఆదోనిలో జరిగే మైనారిటీల మహాగర్జనను విజయవంతం చేయాలని కోరారు.

మంత్రాలయం మఠానికి రూ.2.49 లక్షల విరాళం

మంత్రాలయం, ఫిబ్రవరి 25: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన నాగరాజు సిద్దేశ్వర్ అనే భక్తుడు రూ.లక్ష, ప్రసన్న కుమార్ అనే భక్తుడు రూ.49 వేలు, హైదరాబాదుకు చెందిన రామకృష్ణ అనే భక్తుడు రూ.లక్ష అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి తెలిపారు. ఆదివారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.2.49 లక్షలు నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబ సభ్యులకు మఠం దివాన్ పురాణిక్ శ్రీనివాస ఆచార్ మోమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

కిక్కిరిసిన భక్తులు : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఆదివారం రాత్రి వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది.

బెల్డోణ వద్ద అనాథ శవం

చిప్పగిరి, ఫిబ్రవరి 25: మండలంలోని బెల్డోణ పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని మహిళ శవాన్ని ఆదివారం గుర్తించారు. స్థానికులు వీఆర్వో పెద్దన్నకు తెలియజేయడంతో ఆయన చిప్పగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆమె పైన ఎటువంటి దుస్తులు లేవు. ఆమె వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల లోపల ఉంటుందన్నారు. ఆమె వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని అన్నారు.